క్లుప్తంగా

జాబ్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

వెల్దండ: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులకు చేసే కూలీలకు జాబ్‌కార్డులు లేని వారు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా జాబ్‌కార్డు కోసం ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్, దరఖాస్తుతో జత చేసి గ్రామ కార్యదర్శికి అందజేయాలని కోరారు. ప్రతి వారం కూలీలకు బిల్లులను ఖాతాలో జమచేస్తామన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న వనపర్తి ఎమ్మెల్యే



బిజినేపల్లి: మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి వారిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి దంపతులు ఆదివారం ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చక బృందం వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గోత్రనామార్చన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు శ్రీప్రసాద్‌చార్యులు పాల్గొన్నారు.

తగ్గిన వరిసాగు

పెద్దకొత్తపల్లి: మండలంలో ఈ ఏడాది యాసంగిలో 8,532 ఎకరాలలో వరిసాగు చేపట్టారు. గతేడాది కేఎల్ఐ నీరు రావడంతో మండలంలో 16 వేల ఎకరాలలో వరిసాగు చేశారు. 50 శాతం వరిసాగు తగ్గిపోయింది. ఆదివారం రైతులు పొలాల్లో వరికోతలను ముమ్మరం చేశారు. మండలంలో 18 వరి కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

మేడేను విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేద్దామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మేడేకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అన్ని కార్మిక సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చిన్న పాగ శ్రీనివాసులు, వెంకటేష్, కృష్ణయ్య, బండారుబాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల

ఉప్పునుంతల: మండలంలోని లక్ష్మాపూర్‌లో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 138వ మేడే దినోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, వెంకటేష్, కృష్ణయ్య, బాలయ్య, ఈశ్వరయ్య, ఉశన్న తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి గాయాలు

కోడేరు: రెండు బైక్‌లు ఢీకొన ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చెన్నయ్య వివిధ పనుల నిమిత్తం కల్వకుర్తికి బైక్‌పై బయలుదేరాడు. గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్నాయి. చికిత్స నిమిత్తం బాధితులను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కేవీపీఎస్ నాయకుల నిరసన



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేవీపీఎస్ నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న మాట్లాడుతూ మండలంలోని ఖానాపూర్‌లో ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని నీలిజెండాలు, తోరణాలు ఏర్పాటు చేస్తే గ్రామంలో కొందరు దుండగులు తొలగించారన్నారు. నిందితులను గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, రాంబాబు, కృష్ణ, చంద్రయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

సలేశ్వరానికి ప్రత్యేక బస్సులు

కొల్లాపూర్: కొల్లాపూర్ నుంచి సలేశ్వరానికి సోమవారం ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమాశంకర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయని.. సలేశ్వరం ఉత్సవాలకు వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అటవీ ఉత్పత్తులు కరువు

- నన్నగిల్లుతున్న ఆశలు
- జీవనోపాధి కోల్పోతున్న గిరిపుత్రులు



చెంచులు సేకరించిన కుంకుడు కాయలు



ఎండలో ఆరబెట్టిన ఇప్ప పలుకు



ఎండలో ఆరబెట్టిన జిగురు

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఒకప్పుడు పుష్కలంగా అటవీ ఉత్పత్తులు లభించేవి. ఏటేటా ఉత్పత్తులు తగ్గిపోతుండటంతో గిరిపుత్రులు జీవనోపాధి కోల్పోతున్నారు. అడవిలోతట్టు ప్రాంతాలకు వెళ్లి ఎంతో కష్టపడి సేకరించిన వాటికి గిట్టుబాటు ధర లభించడం లేదని చెంచులు వాపోతున్నారు. కొన్నేళ్ల కిందట అడవులలో ఎక్కడ చూసిన అటవీ సంపద విరివిగా లభ్యమయ్యేదని, నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదని గిరిపుత్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలానుగుణంగా అడవులు అంతరించి పోతుండడం, ఉన్న అటవీ ఉత్పత్తులను సేకరించుటకు అటవీ శాఖ వారు ఆంక్షలు పెట్టడంతో చెంచుల జీవన గమనం ప్రశ్నార్థకంగా మారింది.

అడవిలో లభించే ఉత్పత్తులు ఇవే..

నల్లమల ప్రాంతం వనమూలికలకు పుట్టినిల్లు. అడవిలో ఎంతో విలువైన ఉత్పత్తులు దొరికేవి. కరక్కాయలు, చిల్లిగింజలు, ఇప్పపువ్వు, తేనె, మైనం, జిగురు, మారెడుగడ్డలు, విషముష్టిగింజలు, చింతపండు, ఉసిరికాయ, ఎలక్కాయలు విరివిగా లభించేవి. అడవుల్లో ఉంటున్న చెంచులు వీటిని సేకరించి జీసీసీ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించగా వచ్చిన డబ్బుతో నిత్యావసర సరకులు కొనుగోలు చేసి జీవనోపాధి పొందేవారు. ప్రస్తుతం చెంచులకు అటవీ ఉత్పత్తులపై ఆశలు సన్నగిల్లాయి. కాగా చెంచులు సేకరించిన అటవీ ఉత్పత్తులను గతంలో జీసీసీ షాపుల ద్వారా కొనుగోలు చేసే వారు. కాని కొనుగోలు చేసే దుకాణాలు కూడా మూత పడడం, సేకరించిన అటవీ ఉత్పత్తులు అమ్మే పరిస్థితులు లేక పోవడంతో చెంచులు అటవీ ఉత్పత్తుల సేకరణకు ఆసక్తి చూపడం లేదు. గతంలో మండలంలో లింగాల, చెన్నంపల్లి, దారారం, అప్పాపూర్‌పెంట, అప్పాయపల్లి తదితర ప్రాంతాలలో జీసీసీ షాపులు ఉండేవి. ప్రస్తుతం ఆ షాపులు శిథిలావస్థకు చేరి పూర్తిగా కూలి పోయాయి.

తునికాకు సేకరణ నిలిపివేత

వేసవి కాలం వచ్చిందంటే చెంచులకు ఇతర వర్గాలకు తునికాకు సేకరణతో జీవనోపాధి పొందేవారు. లింగాల అటవీ శాఖ రేంజ్ పరిధిలో కల్లాలను ఏర్పాటు చేసి ఆకును సేకరించేవారు. కాని కొన్నేళ్ల నుంచి ఆకు సేకరణకు అటవీ శాఖ స్వస్తి పలకడడంతో గిరిపుత్రులు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారు. అడవులు, వన్య ప్రాణుల రక్షణను దృష్టిలో ఉంచుకొని అటవీ శాఖ వారు తునికాకు సేకరణను పూర్తిగా నిలిపి వేశారు.

ఉపాధి పనులు కల్పించాలి



అడవులను నమ్ముకొని జీవిస్తున్నాం. అటవీ ఉత్పత్తుల సేకరణకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. దీంతో జీవనాధారం లేకుండా పోయింది. ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలి. చెంచులకు ఉపాధి చూపించాలి.

– బల్మూర్ బయ్యన్న, ఎర్రపెంట

చెంచులను ఆదుకోవాలి



అటవీ ఉత్పత్తులు తగ్గడం చెంచుల బతుకుదెరువు కష్టంగా మారింది. కూలీ పనులు దొరకక అవస్థలు పడుతున్నారు. ఉపాధి పనులు కూడా కల్పించడం లేదు. చెంచుల పరిస్థితి దయనీయంగా మారింది. తునికాకు సేకరణ ప్రారంభించాలి. అటవీ ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలను తిరిగి ప్రారంభించాలి.

– కాట్రాజు శ్రీనివాసులు, చెంచు నాయకుడు, లింగాల

భక్తిభావంతో మెలగాలి



పూజలు చేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకొని సన్మార్గంలో పయనించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని మల్లాలమ్మ ఆలయ కమిటీ, మేదరి సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా మల్లాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, శివకుమార్, సంజీవన్, మాజీ సర్పంచ్ ఆనంద్, రమాకాంత్, యాదయ్య, కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



సీతారాంపూర్ వద్ద విద్యుత్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించిన అధికారులు



బల్మూర్ రోడ్డు పక్కన ..

బల్మూర్: అధికారుల ముందుచూపు లేకపోవడంతో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో హరితహారంలో భాగంగా మండలంలోని కొండనాగుల, బల్మూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో అటవీశాఖ ఆధ్వర్యంలో 2016 సంవత్సరంలో మొక్కలను నాటారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ తీగలను తాకుతున్నాయి. దీంతో తరుచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. స్తంభాలకు సమానంగా ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ అధికారులు మూడు రోజులుగా యంత్రాలతో తొలగిస్తున్నారు. అధికారులు ముందు చూపు లేకనే చెట్లను తొలగించాల్సిన దుస్థితి నెలకొందని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడాలని కోరుతున్నారు.

వినియోగదారుల సౌకర్యార్థం కోసమే

స్తంభాలకు సమాన ఎత్తులో ఉన్న చెట్ల కొమ్మలను మాత్రమే తొలగిస్తున్నాం. ప్రస్తుతం చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. తప్పని పరిస్థితిల్లో కొమ్మలను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం చర్యలు చేపట్టాం.

–సుధాకర్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ, బల్మూర్

నిరుపయోగంగా సీసీ కెమెరాలు



అంబేడ్కర్ కూడలిలో వృథాగా ఉన్న సీసీ కెమెరాలు



వివేకానంద విగ్రహం వద్ద

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లోని అంబేడ్కర్, వివేకానంద కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. ఈ కూడలి నుంచే ప్రతి నిత్యం వివిధ జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన వాహనాలు వేల సంఖ్యలో రాకపోకలు కొనసాగిస్తుంటాయి. చోరీల నియంత్రణకు, శాంతిభద్రతల పర్యవేక్షణలో ఎంతో కీలకంగా పనిచేసే సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

బాధితులకు పరామర్శ



తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య వారం రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆదివారం గ్రామంలో బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వర్దల్లివెంకటేష్, భరత్‌కుమార్, శ్రీశైలంగౌడ్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం



తాడూరు: మండల కేంద్రంలోని కూచుకుళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తైక్వాండో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నారులకు శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతోందన్నారు. చిన్నారులు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ సీతారాంనాయక్, తైక్వాండో అసోసియేషన్ సభ్యులు రవికుమార్, స్వాతి, కోర్టు ఎర్రోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్లలో తాగునీటి ఎద్దడిని నివారించాలని రెండు బోర్లను వేశారు. రెండు బోర్లలో నీళ్లు రావడంతో గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. బోర్ వేసేందుకు సహకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రెగ్యూలర్ డాక్టర్‌ను నియమించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. పీహెచ్‌సీలో కొన్ని నెలలుగా రెగ్యూలర్ డాక్టర్ లేకపోవడంతో రోగులకు సరైన వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి రెగ్యూలర్ డాక్టర్‌ను నియమించి వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని కోరారు.

మల్లురవిని ఆశీర్వదించండి



మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ కోరారు. ఆదివారం మండలంలోని పల్కపల్లి శివా రులో యూత్ కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు మల్లురవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లురవిని గెలిపించుకొని రాహుల్‌గాంధీకి కానుకగా ఇద్దామన్నారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సురభీదీవెది, ఖలీద్, ఛత్రునాయక్, భాస్కర్, రేణయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశం సుభిక్షం



కాంసానిపల్లి తండాలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఉప్పునుంతల: పీఎం నరేంద్రమోడీ పాలనలోనే భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి సుభిక్షంగా ఉందని మరోసారి బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనునాయక్ అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఆదివారం మండలంలోని కాంసానిపల్లి తండా, కొరటికల్, పెనిమిళ్ల తదితర గ్రామాల్లో బీజేపీ జిల్లా, మండల నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. జిల్లా నాయకులు సైదులుయాదవ్, రమేష్, రవినాయక్, ఎల్లయ్యయాదవ్, సురేందర్‌రెడ్డి, జైపాల్, శ్రీకాంత్, శివ, గణేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హరిహర రుద్రహోమం



హోమంలో పాల్గొన్న మహిళలు, భక్తులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు కొనసాగనున్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం గణపతిపూజ ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం ఆలయ సమీపంలో గజారోహనం నిర్వహించారు. 108 కలశాలకు పూజలు చేశారు. లక్ష్మీహరిహర రుద్రహోమంలో మహిళలు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సచ్చిదానంద స్వామిజీ, నర్వికల్యానందస్వామిజీ, కృష్ణానందస్వామిజీలు ప్రవచనం చేశారు. ఉత్సవాలు పురస్కరించుకొని ఆలయంలో హనుమాన్ జ్ఞానయజ్ఞ సమితి ఆధ్వర్యంలో హనుమాన్‌చాలీసా పారాయణం, భగవత్‌గీత పఠనం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్యుడు దామోదర్‌రెడ్డి ధ్వజాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీశైలం, గండె రవి, వెంకటయ్య, రాధాకృష్ణ, శ్రీనివాస్, నర్సింహ తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



సీతారాముల ఉత్సవమూర్తులు

కొల్లాపూర్: పట్టణంలోని రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవతామూర్తులకు అభిషేకాలు, అలంకారాలు చేశారు. మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణల మధ్య దేవతామూర్తుల కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జై శ్రీరాం నినాదాలతో ఆలయ ప్రాంగణం హోరెత్తింది. ఆలయ ట్రస్టీ ఆదిత్య లక్ష్మారావు పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు.

డొంకదారికి మహర్దశ



బల్మూర్–చెన్నారం డొంకదారి

బల్మూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్క నుంచి చెన్నారం గ్రామం వరకు ఉన్న డొంకదారిని బీటీగా మార్చేందుకు ఆరు నెలల కిందట ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2కోట్లు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం నాలుగు కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టారు. ఈ రోడ్డు పూర్తైతే మండలంలోని చెన్నారం, రామాజిపల్లి, గట్టుతుమ్మెన్, మహాదేవ్‌పూర్ గ్రామాలకు చెందిన ప్రజలకు మండల కేంద్రానికి రావడానికి దూరం తగ్గనుంది. ప్రస్తుతం ఈగ్రామాల వారు మండల కేంద్రానికి రావాలంటే అచ్చంపేట మీదుగా సుమారు 20 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తున్నారు. బల్మూర్, రామాజిపల్లి, చెన్నారం, గోదల్ గ్రామాలకు చెందిన వ్యవసాయ పొలాలకు కూడా రోడ్డు ఇబ్బందులు తొలగనున్నాయి. పనుల ప్రారంభమవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి శివరామాంజనేయ మహోత్సవం



ముస్తాబైన శివరామాంజనేయ ఆలయం

పాన్‌గల్: మండలంలోని అన్నారంలో సోమవారం నుంచి శివరామాంజనేయ ఆలయ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే మహోత్సవంలో ధ్వజస్తంభం, బొడ్రాయి, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపనలు, సీతారాముల వారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.



రిజర్వాయర్‌లో చేపల గూళ్లు

మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో చేపలు తమ సంతాన ఉత్పత్తి కోసం నివాసాలు ఉండేందుకు గూళ్లు తయారుచేసుకున్నాయి. గుంతల మాదిరిగా ఉండే ఈ గూళ్లలో గుడ్లను పెట్టి పిల్లలను పెంచుకుంటాయి. దూబొచ్చె రకం చేప ఈ రకమైన ఇళ్లను తయారు చేసుకుంటాయని మత్స్యకారులు తెలిపారు. జలాశయంలో భారీగా నీటిమట్టం తగ్గడంతో ఇలాంటి గూళ్లు అనేకం బయటపడుతున్నాయి.

– వీపనగండ్ల